


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 17-05-2026 సంపుటి : 07 సంచిక 345 పేజీలు : 8 వెల : రూ 3-00


## పిల్లలు భారం కాదు.. వాళ్లే మన సంపద: సీఎం చంద్రబాబు



శ్రీకాకుళం, మే 16: సీఎం నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. నరసన్నపేట నియోజకవర్గంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు దేశంలో, రాష్ట్రంలో జనాభా పెరుగుదలను అరికట్టడమే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేస్తే.. ఇప్పుడు కాలం మారిందన్నారు. రాష్ట్రంలో మారుతున్న జనాభా గమనాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సమాజంలో ఓ కొత్త చర్చకు దారితీశాయి. పిల్లలు భారం కాదని, వాళ్లే మన అసలైన సంపదంటూ ఆయన సరికొత్త నినాదాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చారు.సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'ఒకప్పుడు వనరుల కొరత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా 'ఒకరు లేదా ఇద్దరు ముద్దు' అనే విధానాన్ని సమాజంలోకి తీసుకెళ్లాం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జననాల రేటు ప్రమాదకర స్థాయికి పడిపోతోంది. యువత సంఖ్య తగ్గి, వృద్ధుల శాతం పెరిగితే భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత ఏర్పడుతుంది. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. జపాన్, చైనా సహా కొన్ని ఐరోపా దేశాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న జనాభా క్షీణత సంక్షోభం ఏపీకి రావొద్దు. జనాభా సమతుల్యతను కాపాడేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. ఇందులో భాగంగా మూడో బిడ్డ పుట్టిన వెంటనే ఆ కుటుంబానికి రూ.30,000, నాలుగో బిడ్డ పుట్టిన వెంటనే రూ.40,000 తక్షణ ఆర్థిక సహాయం అందిస్తాం. పిల్లలు భారం కాదు, వాళ్లే మన అసలైన సంపద' అని అన్నారు.గత ఐదేళ్ల అరాచక పాలనకు స్వస్తి పలికి, ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రభుత్వ భవిష్యత్తు కార్యాచరణపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.'ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి తల్లికి రూ.15,000 అందిస్తోంది. భగవంతుడు కరుణించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగైతే భవిష్యత్తులో ఈ సహాయాన్ని మరింత పెంచుతాం. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. ఐదేళ్ల కాలంలో 'గొడ్డలి పార్టీ' ఎన్నో అరాచకాలు సృష్టించింది. భూ రికార్డులను మార్చేసి, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి చట్టాలతో ప్రజల ఆస్తులను గందరగోళంలోకి నెట్టింది. ఆ అరాచకాలను రాష్ట్ర ప్రజలంతా చూశారు, సరైన తీర్పు ఇచ్చారు. ఇకపై ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూసే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే' అని అన్నారు.

## కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..



ఢిల్లీ: భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి.కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవార మనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

## ప్రధాని పిలుపుతోనే ఆన్‌లైన్‌లో టీడీపీ మహానాడు: మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణాజిల్లా, మే 16: పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన




మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్స్ వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియచేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారునిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయిస్తే సహించమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## 182 కోట్ల ఖరీదైన జిహాదీ డ్రగ్ స్వాధీనం: కేంద్ర మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దేశంలో తొలిసారి జిహాదీ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నార్కోటిక్స్ ట్రాఫిక్కింగ్ బృందంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. కాప్టగాన్ అనే ఆ డ్రగ్ విలువ మార్కెట్లో సుమారు 182 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ పట్టివేతకు ఆపరేషన్ రేజ్‌పిల్ అనే కోడ్ నేమ్ పెట్టారు. డ్రగ్ ట్రాఫిక్కింగ్‌కు పాల్పడిన విదేశీ వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ కన్‌సైన్మెంట్ ను పశ్చిమాసియా దేశాలకు తరలిస్తున్నారు. ఇండియాను ట్రాన్సిట్ మార్గంలో వాడేందుకు ప్రయత్నించారు.అమిత్ షా తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని చెప్పారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కావలన్న లక్ష్యంతో మోదీ సర్కారు పనిచేస్తోందని, దానిలో భాగంగానే అరెస్టులు జరిగినట్లు వెల్లడించారు.






## సీబీఎస్ఈ కీలక నిర్ణయం..




### 9, 10 తరగతులకు 'మూడు భాషలు' తప్పనిసరి

న్యూఢిల్లీ, మే 16 : దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రాబోయే 2026 జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'మూడు భాషల విధానాన్ని తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం (ఔఇఖ 2020), నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 2026–27 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు.చ్చితంగా రెండు భారతీయ భాషలు: కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి.ఫారిన్ లాంగ్వేజ్ ఆప్షన్: ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే.. మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి ఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగానూ ఎంచుకోవచ్చు.బోర్డు పరీక్షల నుంచి మినహాయింపు: విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు(ఖీ3) 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి.మిడిల్ స్టేజ్(మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి ఖీ3 పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు.ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను 2026 జూన్ 15 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. జులై 1లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఖీ3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది.

# సంపాదకీయం

ఆదివారం 17-05-2026

## డాలర్ స్థానంలో బ్రిక్స్ ...

ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి. ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ-7 (ఉ7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్‌లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ-బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

## 'ఇంధన ధరల పెంపుతో సామాన్యులపై మోయలేని భారం'

### సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

రామగిరి, మే 16 : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శిస్తూ సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండలో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ.. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ




పన్నులు విధిస్తూ ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా ఛార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించి ప్రజలపై భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సీనియర్ నాయకులు ముండ్ల ముత్యాలు, ఎస్.కె.మధార్, బాసాని వెంకటయ్య, పుట్టల సుజాత, జగన్, సర్దార్, గునా నారాయణ, ఎం.నందం, ఆర్.సీతారాములు, చాంద్ పాషా, వలికి వెంకటేశం, పంజాల నరసింహ, కందికట్టి ఎల్లయ్య, ఓర్పు అంగయ్య, అంజయ్య, జె. విజయ, మద్దిమడుగు పార్వతమ్మ, చిత్రం, రజిత, మాధవి, రాములమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

## మంత్రుల జాబితా సిద్ధం చేస్తున్నాం

### 18న ప్రమాణ స్వీకారం.. సతీశన్

తిరువనంతపురం: కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం కొలువు తీరేందుకు సిద్ధమవుతోంది. మంత్రివర్గం ఏర్పాటుపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 17వ తేదీ ఆదివారంనాడు మంత్రుల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నట్టు వీడీ సతీశన్ తెలిపారు. మే 18న తనతో పాటు మంత్రులంతా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నేతలతో శనివారంనాడు




సమావేశానంతరం మీడియాతో సతీశన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలుచేసినా సెక్యులర్ విధానాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు సతీశన్ చెప్పారు. 'కేరళంలో కొన్ని శక్తులు విద్వేష ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ముస్లిం లీగ్, వారి నేత పనక్కాడ్ సైయిద్ సాదిఖ్ అలి బలమైన సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉన్నారు. యూడీఎఫ్ కూడా సెక్యులర్ విధానానికి కట్టుబడి ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం' అని వివరించారు. ఎన్నికల ప్రచారంలో ఐయూఎంఎల్‌తో యూడీఎఫ్ పొత్తును బీజేపీ, సీపీఎం లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేశాయని, కానీ ప్రజలు ఆ ఆరోపణలను తిప్పికొట్టి 102 సీట్లలో తమను గెలిపించారని సతీశన్ చెప్పారు. కాగా, దీనికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల నివాసానికి వెళ్లి సతీశన్ కలుసుకున్నారు. మంత్రివర్గం కూర్పు, శాఖలపై ఆయనతో చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌పై యూడీఎఫ్ విజయం సాధించింది. 140 స్థానాల్ల 102 సీట్లు గెలుచుకుంది. 2021 నుంచి విపక్ష నేతగా సతీశన్ వ్యవహరిస్తూ ఎల్‌డీఎఫ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో ఆయనను సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది.

## విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ప్రొఫెసర్

ఉత్తర్‌ప్రదేశ్, మే16: విద్యార్థులను మంచి దేశ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువులు కీలక పాత్ర పోషిస్తుంటారు. యువతకు విద్యాబోధనలు చేస్తూ వారి ఉన్నతికి ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు తోడ్పడుతుంటారు. అందుకే సమాజంలో గురువులకు ఎంతో గౌరవం ఉంటుంది. అయితే నేటికాలంలో కొందరు మాత్రం ఉపాధ్యాయ వృత్తికి అపకీర్తి తెస్తున్నారు. బిడ్డలాంటి తమ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి కీచక గురువులకు పోలీసులు బుద్ధి చెప్తున్నా.. ఇంకా పుట్టుకొస్తున్నారు. తాజాగా లఖ్‌నవూ యూనివర్సిటీ ప్రొఫెసర్ కీచక బుద్ధి వెలుగులోకి వచ్చింది. లఖ్‌నవూ యూనివర్సిటీలో పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేస్తానని ఆశ చూపిస్తూ, ఒక విద్యార్థిని పట్ల జువాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ పరంజీత్ సింగ్ అసభ్యంగా ప్రవర్తించాడు. యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హసన్‌గంజ్ పోలీసులు సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఆడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యూనివర్సిటీ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడైన ప్రొఫెసర్ పరంజీత్ సింగ్ ఒక విద్యార్థినితో అత్యంత అసభ్యకరంగా మాట్లాడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. సదరు



విద్యార్థినికి అకడమిక్ బెనిఫిట్స్ కల్పిస్తానని నమ్మిస్తూ ఆమెను లొంగదీసుకోవడానికి ప్రయత్నించాడు. దీనికి సంబంధించిన మూడు ఆడియో రికార్డింగ్‌లను ఆ బాధితురాలు యూనివర్సిటీ యాజమాన్యానికి సమర్పించింది. ఆ ఆడియో క్లిప్‌లలో ప్రొఫెసర్ పరంజీత్ సదరు విద్యార్థినిని.. డార్లింగ్ అంటూ సంబోధిస్తూ తన ఆఫీస్ రూమ్‌కు రమ్మని పిలవడం, పరీక్షల ప్రశ్నపత్రాలను ముందే ఇస్తానని ఆశ చూపడం స్పష్టంగా వినిపిస్తోంది. వారానికి ఒకసారి తనను కలవాలని, అలా చేస్తే పరీక్షల్లో పూర్తి సహాయం చేస్తానని అతను ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం ప్రొఫెసర్ ఆడియో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. యూపీ ప్రభుత్వం పరీక్షల సమగ్రత, లైంగిక వేధింపులకు సంబంధించిన కఠిన నిబంధనలను అమలు చేసి, నిందితుడైన ప్రొఫెసర్‌ను అరెస్టు చేయాలని ఏబీవీపీ లఖ్‌నవూ విశ్వవిద్యాలయ యూనిట్ అధ్యక్షుడు జై శ్రీవాస్తవ అన్నారు. సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఏ కార్యకలాపాన్నైనా అత్యంత తీవ్రంగా పరిగణిస్తామని యూనివర్సిటీ పరిపాలన విభాగం స్పష్టం చేసింది. 24 గంటల్లోగా తన విచారణ నివేదికను సమర్పించాలని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జేపీ సైని అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఆదేశించారు.

## లోక్‌సభ ఎన్నికల్లో వివాదాస్పద ప్రసంగం.. అజాంఖాన్‌కు రెండేళ్ల జైలు

న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత అజాం ఖాన్ తిరిగి లీగల్ చిక్కుల్లో పడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి ఆయనకు ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు శనివారంనాడు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీనితో పాటు రూ.5,000 జరిమానా కూడా విధించింది. గత కొన్నేళ్లుగా వరుసగా పలు లీగల్ చిక్కులు ఎదుర్కొంటున్న అజాంఖాన్‌కు మరోసారి ఈ తీర్పుతో ఎదురుదెబ్బ తగిలింది. అజాంఖాన్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా యంత్రాంగం అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలు సంచలనం కాగా, ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. 'స్థిరంగా నిలబడండి. ఈ కలెక్టర్లు, అధికారులకు భయపడవద్దు. వాళ్లు జీతం తీసుకునే ఉద్యోగులు. వాళ్లకు మనం భయపడాల్సిన పనిలేదు. మీరు మాయావతి ఫొటోలు చూసే అంటారు. సీనియర్ అధికారులు ఆమె బూట్లను చేతిరుమాళ్లతో తుడిచారు. మనం ఆమెతో పొత్తు పెట్టుకున్నాం. అల్లా తలిస్తే ఈ ఆఫీసర్లతో కూడా ఆమె బూట్లు పాలిష్ చేయిస్తా' అని ఎన్నికల ర్యాలీలో అజాంఖాన్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నాయంటూ ఫిర్యాదు నమోదైంది. దానిపై ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు విచారణ జరిపి తాజాగా తీర్పునిచ్చింది.

## 'ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలి'

### చండూరు ఎంపీడీఓ బండారు యాదగిరి



చండూరు, మే 16 : వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని చండూరు ఎంపీడీఓ బండారు యాదగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాజాత బృందాల ద్వారా మండలంలోని బోడంగిపర్తి, తాస్కానిగూడెం, పుల్లెంల, ఇడికూడ, సిర్దేపల్లి గ్రామాలలో విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. "భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటి పరిధిలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నీటి పొదుపు పద్ధతులను పాటించాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణపై పంచాయతీ పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. వేముల పుష్ప వీరేశం ఆధ్వర్యంలో కళాజాత బృందం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలలో తమ ఆట పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ పద్ధతులు, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోడంగిపర్తి సర్పంచ్ బొమ్మల సుగుణమ్మ, తాస్కానిగూడెం సర్పంచ్ కొండా రజిత రవి, పుల్లెంల సర్పంచ్ ముక్కముల వెంకన్న, ఇడికూడా సర్పంచ్ పాల్వాయి రమాదేవి, సిర్దేపల్లి సర్పంచ్ దామెర రాములు, మండల ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఏ డీపీఎం సోమయ్య, ఏపీఎం యాదయ్య, ఎంపీఓ కోటయ్య, ఉప సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పాక్ తీరు మారకుంటే.. చరిత్రలో కలిసిపోతుంది: భారత ఆర్మీ చీఫ్

ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక




చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు 'పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు.

## సీఎం విజయ్‌పై సీబీఐ కేసు నమోదుకు అవకాశం: ఎంపీ ఇన్బదురై

చెన్నై: తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీలో బలపరీక్షలో గెలిచేందుకు బేరసారాల ద్వారా పరోక్షంగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేల మద్దతు పొందిన ముఖ్యమంత్రి విజయ్‌పై సీబీఐ కేసు నమోదు చేసే అవకాశముందని అన్నాడీఎంకే నేత, ఎంపీ ఇన్బదురై అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే మ్యాజిక్ ఫిగర్ 118 కంటే తక్కువ స్థానాల్లో గెలుపొందింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని పెంచేందుకు కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు, డీపీఐ, ఐయూఎంఎల్ పార్టీల మద్దతు కూడ గట్టుకుంది. ఈ నేపథ్యంలో, బుధవారం అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో అన్నాడీఎంకే చీలిక వర్గానికి చెందిన సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి నేతృత్వంలో 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా ఓటేయ్యడంతో టీవీకే ప్రభుత్వ బలం మరింత పెరిగింది. ఎవ్వరూ ఊహించని విధంగా అసెంబ్లీలో అన్నాడీఎంకే చీలిక వర్గం ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ఆ పార్టీ పార్లమెంట్ సభ్యుడు ఇన్బదురై తప్పుబట్టారు.





# టీడీపీ కొత్త ప్రచారం

ఒంగోలు, మే 16,తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మబడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు.వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు.సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు.

## స్ట్రాటిజిస్ట్ లుకాదు.. అస్ట్రాలిజిస్ట్

విజయవాడ, మే 16రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది.గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం.తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

## తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

తిరుమల, మే 16కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు.అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి.ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా? వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది.అంటే?. గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది.కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు.స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

# అమరావతికి యుద్ధ గండం...


విజయవాడ, మే 16,ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది.



ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది.అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది.రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది. అమరావతి చుట్టూ జరుగుతున్న రాజకీయం ఈ అనుమానాలను మరింత బలపరుస్తోంది. రాజధాని పనులు వాయిదా పడతాయనే ప్రచారం ద్వారా ఇన్వెస్టర్లలో భయాందోళనలు సృష్టించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిర్మాణ పనులు జోరుగా సాగుతున్ నసమయంలో ఇలాంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి వాయిదా నిర్ణయాన్ని ప్రకటించలేదని కూటమి నేతలు గట్టిగా చెబుతున్నారు. నీతి ఆయోగ్ వివరణ కూడా ప్రభుత్వానికి కొంత ఊరటనిస్తోంది. కానీ, ప్రపంచ యుద్ధ మేఘాలు తొలగిపోనంత కాలం అమరావతి వంటి భారీ ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటూనే ఉంటాయన్నది సత్యం. ఏపీ రాజధాని కల నెరవేరాలంటే కేవలం రాష్ట్ర సంకల్పం మాత్రమే కాదు, అంతర్జాతీయ పరిస్థితులు కూడా అనుకూలించాల్సిన అవసరం కనిపిస్తోంది.

# దువ్వాడ లెక్క ఏంటీ

శ్రీకాకుళం, మే 16,పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు.ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు



పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది.ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

# సౌత్ పై జనసేన ఫోకస్...



గుంటూరు, మే 16 జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది.జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది.ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

## భారీ మెజార్టీపై నేతలు కన్ను

విశాఖపట్టణం, మే 16టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు.గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు.ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు.ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## నేడు కృత్తిక నక్షత్రం సందర్భంగా షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు..

విభారే న్యూస్ మే 16 కర్నూలు జిల్లా ప్రతినిధి ..జయ గురుదత్త శ్రీ గురుదత్తశ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో 17-05-26, ఆదివారం, కృత్తిక సందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు, అర్చనలు, సర్వ సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు, కావడి సేవ, కందుల హరతులు, జరుగును. కందుల హారతులు, కావడిసేవ శ్రీ స్వామి వారికి అత్యంత విశేషమైనవి.. కావున వివాహ సమస్యలు, భూ సమస్యలు, సంతాన సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోని శ్రీ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కాగలరు. అధిక జ్యేష్ఠ మాసంలో స్వామి వారి పూజ అధిక ఫలితాన్నిస్తుంది..కావడి సేవ - 250/-కందుల హరతులు - 55/-పంచామృత అభిషేకం - 200/-మాసపూజ - 300/-నిత్య పూజ -3000/-కావడి సేవ ఉదయం 7:30గంటలకు ఉండగలదు.. సంప్రదించండి :-శ్రీధర్ శర్మ - 7995202082..దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు, దేవాలయం వాట్సాప్ నెంబరు..8896123777..ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388




## ప్లాస్టిక్ ఇస్తే బహుమతి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16:స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల గాంధీచౌక్ మార్కెట్ ప్రాంతంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పాల్గొని పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని మంత్రి ఫరూక్ అన్నారు. వ్యాపారులు చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే సీసీ కెమెరాల ఆధారంగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో భాగంగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ మార్పిడి కేంద్రాన్ని మంత్రి, కలెక్టర్ ప్రారంభించారు. ప్రజలు 1 కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు అందజేస్తే 1 కేజీ చక్కెర లేదా సేమియా లేదా 6 గుడ్లు ప్రోత్సాహకంగా అందజేస్తున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే వ్యాపారులకు హెచ్చరిక నోటీసులు జారీ చేశామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్లాస్టిక్ మార్పిడి కేంద్రాలను మున్సిపల్ కార్యాలయం, జీజీహెచ్, గాంధీచౌక్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, తాసిల్దార్ శ్రీనివాసులు అధికారులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ లో కమిషనర్ తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16:నంద్యాల పట్టణంలోని అన్న క్యాంటీన్లను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. క్యాంటీన్లలో భోజనం చేస్తున్న ప్రజలను స్వయంగా కలుసుకుని అందుతున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉండాలని, నాణ్యమైన భోజనం సమయానికి అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. క్యాంటీన్ల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.అన్న క్యాంటీన్ల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పంచలింగాల టోల్‌గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సు ప్రారంభం...



విభారే న్యూస్ మే 16 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా పంచలింగాల టోల్‌గేట్ వద్ద నిర్వహించిన బ్లాక్ స్పాట్స్ పరిశీలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పంచలింగాల టోల్‌గేట్ పరిసర ప్రాంతాల్లో గుర్తించిన ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి,రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు మరియు హైవే అధికారులకు పలు సూచనలు చేశారు.రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, సరైన లైటింగ్, రహదారి గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మహానందికి పాలక మండలి ఎప్పుడు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16:ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మహానంది దేవస్థానానికి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పాలక మండలి ఏర్పాటు కాకపోవడం భక్తుల్లో తీవ్ర ఆగ్రహం, అనుమానాలకు దారితీస్తోంది. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే దేవస్థానంలో పాలక మండలి లేకపోవడం వల్ల పరిపాలన పూర్తిగా అధికారుల చేతుల్లోనే కొనసాగుతుండటంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పాలక మండలి లేకపోవడంతో దేవస్థాన అభివృద్ధి పనులు, ఆదాయ వ్యయాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం పరిపాలనలో పారదర్శకత కరువైందని, దీనివల్ల అవినీతి పెరిగే పరిస్థితులు ఏర్పడ్డాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరొందిన మహానంది దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే ఆలయ పరిసరాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, భక్తులకు తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో పలు సమస్యలు కొనసాగుతున్నాయని భక్తులు చెబుతున్నారు. పాలక మండలి ఉంటే భక్తుల సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉండేదని అభిప్రాయపడుతున్నారు.దేవస్థానంలో జరుగుతున్న నిర్ణయాలు పూర్తిగా కొందరు అధికారుల ఆధీనంలోనే కొనసాగుతున్నాయని, రాజకీయ నాయకుల జోక్యం కూడా పెరిగిందని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు. "అడిగిందే ఆమోదం, చెప్పిందే నిర్ణయం" అన్నట్టుగా వ్యవహారాలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. పాలక మండలి లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొంటున్నారు.గతంలో పాలక మండలి ఉన్న సమయంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయని, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టేవారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని, ఆలయ ఆదాయానికి తగ్గట్టుగా అభివృద్ధి జరగడం లేదని అంటున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే మహానంది దేవస్థానానికి పాలక మండలిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ పరిపాలనలో పారదర్శకత తీసుకురావడంతో పాటు భక్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.తగ్గట్టుగా అభివృద్ధి జరగడం లేదని అంటున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే మహానంది దేవస్థానానికి పాలక మండలిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ పరిపాలనలో పారదర్శకత తీసుకురావడంతో పాటు భక్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## డెంగ్యూపై జాగ్రత్తలు తప్పనిసరి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16:జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డెంగ్యూ నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటరమణ సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెంగ్యూ నియంత్రణలో భాగంగా "చెక్, క్లీన్, కవర్" విధానాన్ని ప్రజలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ముఖ్యంగా కూలర్లు, డ్రములు, టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా శుభ్రం చేయాలని తెలిపారు.జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా తీసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా. చంద్రశేఖర్ రావు, వైద్య అధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఫీహెచ్‌ఏలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముస్లిం విద్యార్థులకు ఉచిత శిక్షణ పరీక్ష--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16: జిల్లాలో ముస్లిం పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాల కోసం నిర్వహిస్తున్న "తాలీమ్-ఏ-హునర్ ప్రతిభ పరీక్ష"కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.పదో తరగతిలో 450కు పైగా మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులు అర్హులని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ ఆధారంగా 250 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఇంజినీరింగ్, వైద్య ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు వసతి సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు.నంద్యాల జిల్లా నుంచి సుమారు 750 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నంద్యాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 240 మంది, నేషనల్ డిగ్రీ కళాశాలలో 450 మంది పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లతో అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.



## పోలీస్ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16:నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది కార్యాలయాలు మరియు పరిసరాలను శుభ్రపరిచారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్, సైబర్ క్రైమ్, ఫ్యాక్షన్ జోన్, సాయుధ బలగాలు, మోటార్ వెహికల్ విభాగాలతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షొరాణ్ మాట్లాడుతూ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు పోలీసులు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

## మార్కెట్ యార్డు లో సహజ మామిడి విక్రయాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 16అహోబిలం ప్రాంతంలోని మామిడి తోటల్లో సహజ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లను నంద్యాల మార్కెట్ యార్డ్ లో ప్రత్యేకంగా విక్రయిస్తున్నట్లు తోట యజమాని రిటైర్డ్ తాసిల్దార్ సుబ్బరాయుడు తెలిపారు. రసాయనాలు లేకుండా సహజంగా మాగించిన నాణ్యమైన మామిడి పండ్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.ప్రస్తుతం మార్కెట్లో రసాయనాలతో మాగించిన పండ్లు అధికంగా విక్రయమవుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సహజ పద్ధతుల్లో మాగించిన మామిడి పండ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అహోబిలం తోటల్లో ప్రత్యేక పర్యవేక్షణలో పండించిన పండ్లను నేరుగా వినియోగదారులకు అందిస్తున్నామని చెప్పారు.నంద్యాల మార్కెట్ యార్డ్ సమీపంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రంలో మంచి రుచి సువాసన కలిగిన మామిడి పండ్లను తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. సహజంగా మాగించిన పండ్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.ఈ నెల 16వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విక్రయాలు కొనసాగనున్నాయని తెలిపారు. కవరు కట్టిన మామిడి పండ్లు కిలో రూ 130 కాగా కవరు కట్టని పండ్లు కిలో రూ 100కు విక్రయిస్తున్నట్లు చెప్పారు.ప్రజలు ఆరోగ్యకరమైన సహజ మామిడి పండ్లను కొనుగోలు చేసి వినియోగించుకోవాలని రిటైర్డ్ తాసిల్దార్ సుబ్బరాయుడు కోరారు.



## ప్లాస్టిక్ ఇస్తే నిత్యావసరాలు--

### మున్సిపల్ కమిషనర్ బి శేషన్న--



నంద్యాల, మే 16:స్వచ్ఛ సర్వేక్షన్?2025-26లో భాగంగా నంద్యాల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపాలిటీకి అందజేసే ప్రజలకు బదులుగా నిత్యావసర వస్తువులు ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు.శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజల సౌకర్యార్థం మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కౌంటర్లు వారం రోజుల పాటు అందుబాటులో ఉంటాయని, అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో శాశ్వత కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.పట్టణంలో ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లను రోడ్లు, కాల్వలు, ఖాళీ స్థలాల్లో పడవేయకుండా మున్సిపాలిటీకి అప్పగించాలని ప్రజలను కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ పరిశుభ్రతను కాపాడవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 2 కిలోల ప్లాస్టిక్ కవర్లకు 1 కిలో బాంబినో సేమియా, 1 కిలో ప్లాస్టిక్ కవర్లకు 1 కిలో చక్కెర, అర కిలో ప్లాస్టిక్ కవర్లకు 6 కోడి గుడ్లు అందజేయనున్నట్లు కమిషనర్ బి. శేషన్న తెలిపారు.ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు వచ్చి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో నంద్యాల పట్టణానికి ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190